# ఆకాశం విశాలం

ఎప్పటిలాగే ఉదయం పూట ఆ పార్కులోని బెంచిమీద తల వాల్చి పడుకున్నాను. పచ్చటి పూల సౌరభం, ఫౌంటెన్ నుంచి చిమ్ముతున్న జలధార. పార్కులోని లాన్ మీద గంతులేస్తున్న పసివాళ్ళు. వాతావరణం ఆహ్లాదకరంగా వుంది. అయినా నాలో ఏ స్పందనా లేదు. బహుశా ఆకలి వల్ల కాబోలు పేగులు లుంగచుట్టుకుపోతున్నాయి. రాత్రి మంచినీళ్ళు తాగి పడుకున్నాను. ఉదయం లేని మెల్లగా నడుచుకుంటూ పార్కుకు చేరుకున్నా, ఎవరైనా తెలిసినవాళ్ళు కనిపిస్తారేమోనని దూరంగా కొండల నడుమ గుడిలో వినవస్తున్న గంటల శబ్దం. వెళితే ప్రసాదం దొరకుతుంది. అయినా నడిచే ఓపిక లేదు.

ఇంత భయంకరమైన ఆకలి, ఈ రెండు నెలల్లోనూ ఎప్పుడూ అనుభవించలేదు.

ఇల్లు గుర్తుకొచ్చింది.

''నాయనా తినరా! చాలా ఆలశ్యం అయిపోయింది'' అని అమ్మ ఎంత బతిమాలినా టీవీ నుంచి లేచేవాడిని కాదు. అమ్మే అన్నం కలిపి ముద్దలు పెట్టేది. ఇప్పుడు ఆకలేస్తుంది అంటే ఒక్క ముద్ద పెట్టేవాళ్ళే లేరు.

కళ్ళు నుంచి నీళ్ళు జలజల రాలాయి.

ఆకాశంలో పక్షుల గుంపు సాగిపోతోంది. ఆకాశం, సముద్రం కలిసిపోయి అంతా నీలంగా కనిపిస్తోంది. ఆ పార్కుకు ఆనుకునే రోడ్డు పక్కనే బీచ్. సముద్రపు అలల్లో నీడల్లా కదులుతున్న జాలరుల పడవలు. పలచగా కమ్ముకుంటున్న మబ్బుల మధ్యలో చిక్కుకు పోయిన సూర్యుడు. ఎంత అద్భుతంగా వుంది ప్రకృతి. ఈ దృశ్యాన్ని కెమెరాలో బంధిస్తే బావుండును.

ఇలాంటి పిచ్చితోనే ఈ మహానగరం వచ్చేసాను. భాష పూర్తిగా రాదు. తెలిసిన ముఖాలు లేవు. ఏదో తెలీని బెంగ ఏం సాదిద్దామని?

చిన్నప్పుడు ఫిల్మ్ ముక్కలు ఏరుకొచ్చి, ఇంట్లో దుప్పట్లు కట్టి అందరికీ సినిమాలు చూపించేవాడిని. అలా సినిమా పిచ్చి మొదలయ్యింది. ఆ తర్వాత సినిమా చూసొచ్చి ఆ సినిమా ఎందుకు పోయిందో నేనయితే ఎలా తీస్తానో చెప్పేవాడిని. మిత్రులు ఆశ్చర్యపోయి రాబోయే కాలానికి, కాబోయే డైరెక్టరువి నువ్వే.. అనే వారు. ఫిలిం సొసైటీలో సభ్యుడిగా చాలా సినిమాలు చూసాను. షోమేన్ తీసిన అకిరకుర సోవా. జురాసిక్ పార్క్ చేసిన స్పీల్‌బర్గ్ సినిమాలు చూసి వారికి అభిమానినై పోయాను.

సినిమా డైరెక్టరవుదామని ఇంట్లో చెప్పకుండా చెన్నయ్ పారిపోయి వచ్చేసాను. వచ్చి రెండు నెలలయ్యింది. ఇక్కడ ఒక పెద్ద డైరెక్టరు దగ్గర అసిసెంటు డైరెక్టరుగా చేరానని అమ్మా, నాన్నలకు అబద్ధం చెప్పాను. వాళ్ళు డబ్బు పంపుతామంటే వద్దనేసాను. నేను ఇంటర్ పాసయినప్పుడు, అమ్మ నాకోసం బంగారు గొలుసు చేయించి మెడలో వేసింది. దాన్ని అమ్మేసాను. సినిమాల్లో ఎక్స్ ట్రావేషాలు వేసే ఒక వ్యక్తి పరిచయం అవ్వడంతో అతడి రూములో చేరాను. నేను రాసుకున్న సినిమా కథల్ని ప్రొడ్యూసర్లకు చెప్పడానికి రెండు నెలల నించీ ప్రయత్నాలు చేస్తున్నాను.

"సార్ వణక్కం...." రెండు చేతులూ జోడించి నిలబడిన అరవయ్యేళ్ళ బిచ్చగాడు.

ఆ పిలుపుతో ఇహంలోకి వచ్చాను. నేను చెన్నై వచ్చిన దగ్గర నుంచీ రెండు నెలలుగా నా దగ్గర యాచిస్తున్నాడు. ఎప్పుడూ నేను వాడికి లేదు అన లేదు. ఎప్పుడూ అడిగినా ఐదో, పదో ఇచ్చేసేవాడిని. ఇప్పుడు నాకే గతిలేదు.

"లేవు" అన్నాను. అతను మళ్ళీ "సార్ వణక్కం" అంటూ రెండు చేతులూ జోడించాడు. నాకు కోపం వచ్చింది.

"లేదంటే వినపడలేదా? నిన్నటి నుంచీ భోజనం లేదు. ఉదయం నించీ టీ నీళ్ళు పడలేదు" అంటూ గట్టిగా అరిచాను. ఆ ముసలాడు బెదిరి నట్టున్నాడు. గబగబా అక్కడ నించి కదిలాడు. డబ్బులున్నప్పుడు బాగా దానం చేసేసాను. ఇలా అడిగిన యాచకులకు ఎంతో కొంత ఇవ్వడం అమ్మ నుంచి అలవాటయ్యింది. ఎవరైనా యాచకుడు అడిగితే ఎంతో కొంత దానం చేసేది. మనకున్న దాంట్లో దానం చేసేది ఎంత? అనేది అమ్మ.

"ఎందుకమ్మా అలా దానాలు చేసి వాళ్ళను బద్ధకస్తుల్ని చేయడం" అనేవాడిని. అమ్మ అప్పుడు అనేది 'దొంగ వాడికన్నా యాచకుడే ఎంతో మేలు తనంతట తాను దొంగలించకుండా అడిగి పుచ్చుకోవడం' అనేది అమ్మ. అలా అమ్మ అలవాట్లే నాకూ వచ్చాయి.

ఇన్నిరోజుల తర్వాత నా నిరీక్షణ ఫలించబోతోంది. ఒక ప్రొడ్యూసర్ ఇవాళ రమ్మన్నాడు. కథ చెప్పించుకోవడానికి కాదు వాళ్ళ పిల్లలకు కథలు చెప్పడానికట! నాకు ఆశ్చర్యం వేసింది ఆయన జోక్ చేసాడేమో అనుకున్నాను. కాదు, అది వాస్తవమేనట. ఆయన చెప్పిన మాటలు మదిలో మెదు లుతున్నాయి.

"చిన్నతనంలో అమ్మమ్మలు, తాతయ్యలు మనకు ఎన్నో నీతి కథలు చెప్పేవారు, మహాపురుషుల త్యాగాల గురించి చెప్పేవారు.. ఇప్పుడు అవి చెపుదామన్నా వినే వాళ్ళేరి? నా పిల్లలు ఇంజనీర్లో డాక్టర్లో లేదా ఐఏయస్ అధికార్లో కావాలని లేదు. వాళ్ళను మంచి పౌరులుగా తీర్చిదిద్దితే చాలు. అందుకు మీలాంటి వారి సహాయం కావాలి, నేను వ్యాపార లావాదేవీల్లో సతమతమవుతున్నాను.... కనీసం వారికి మంచీ చెడు గురించి చెప్పే తీరికేది? అందుకే మీ సహాయం కోరుతున్నాను" అన్నాడు ప్రొడ్యూసర్.

ఆయన మాటలు నాకు ఆనందాన్నిచ్చాయి. ఆయనలాగే ఆలోచించే తల్లితండ్రులెంతమంది? పిల్లలకు నీతి కథలు చెప్పేందుకు ఒక ట్యూషన్

మాష్టారును పెడుతున్నాడు... తప్పనిసరిగా వెళ్ళి ఆ పిల్లలకు కథలు చెప్పాలి. మరైతే, జేబుఖాళీ అయింది. నా రూమ్ మేట్ ఇంటి అద్దెకోసం ఐదొందలు అడిగేడు. గొలుసు అమ్మి ఖర్చు పెట్టగా మిగిలిన డబ్బులు మరి ఆలోచించ కుండా ఇచ్చేసాను. ఆకలితో నీరసంతో ఆ ప్రొడ్యూసర్ గారి ఇంటికి ఎలా వెళ్ళడం? ఓపిక లేక కళ్ళు మూసుకున్నాను.

“సార్ వణక్కం...!” అనే పిలుపు. కళ్ళు తెరిచేసరికి ఆ ముసలి యాచకుడు. వీడు నన్ను వదిలేలా లేడు అనుకుంటూ... “గెటవుట్!” అంటూ కోపంగా అరిచాను. ఆ వ్యక్తి నవ్వుతూ “సార్ టిఫిన్ తిని టీ తాగండి” అన్నాడు.

ఆశ్చర్యంగా ఆ యాచకుడి వంక చూసాను. అతడి పక్కనే టీ అమ్మే కుర్రాడు. వాడి చేతిలో టిఫిన్ పొట్లం మరో చేతిలో టీ కెటిల్. నా నోట్లోంచి మాట రాక మునుపే, “సార్ నేనేమీ ముట్టుకోలేదు.. ఆకలిగా ఉన్నారని ఈ టీ కుర్రాడితో తెప్పించాను” అన్నాడు. చుట్టూ చూసాను. ఎదురుగా పిల్లలు ఆటల్లో మునిగి పోయారు. కొంచెందూరంలో లాన్ మీదున్న గడ్డికోస్తున్నాడు తోటమాలి. సైకిల్ మీద ఆడుతూ పడిపోయిన కుర్రాడిని వాడి తల్లి కాబోలు కోప్పడుతోంది.

ఇక మరి ఆలోచించలేదు. ఆ హోటల్ కుర్రాడి చేతిలో పొట్లం అందుకున్నాను. ఇడ్లీలు, దోశ, గబగబా తినేసాను. చాలా రుచికరంగా అనిపించాయి. పక్కనే పైపులోని నీళ్ళు కడుపునిండా తాగాను. టీ కుర్రాడు కెటిల్ లోని టీ గ్లాసులోకి వంపాడు. వేడి టీ తాగేసరికి ప్రాణం లేచి వచ్చి నట్టయింది. క్షుద్బాధ తీరిన తర్వాత గుర్తుకొచ్చింది. వీటికి డబ్బు ఎలా చెల్లించాలా అని వెంటనే అన్నాను.

“డబ్బులు తర్వాత ఇస్తాను బాబూ...”

ఆ టీ కుర్రాడు వెంటనే అన్నాడు. “ఆ ముసలాడు డబ్బు లిచ్చేసాడు సార్! అని నా మెదడు మొద్దుబారి పోయింది. నరనరాల్లో విద్యుత్తు

ప్రవహించినట్టయింది. ఒక యాచకుడి దగ్గర యాచన! బుద్ధ భగవానుని మాటలు గుర్తుకొచ్చాయి. "అహాన్నించి విమోచన కలిగించేదే యాచన!" ఏమయితేనేం నాలోని నేను అన్న అహం పోయింది. ఈసారి డబ్బులెంత అయ్యాయో కనుక్కుని ఇచ్చెయ్యాలి" అనుకున్నాను.

టీ కుర్రాడు గ్లాసు తీసుకుని అక్కడ నుంచి కదిలాడు. నా కళ్ళు ఆత్రంగా ఆ ముసలి వ్యక్తి కోసం వెదికాయి. ఎక్కడా కనిపించలేదు అతడు. నడుచుకుంటూనే నేను వెళ్ళవలసిన ఆ ప్రొడ్యూసర్ గారి ఇంటికి బయలు దేరాను.

* * *

ఆయన నాకోసం ఎదురు చూస్తున్నారు. తమిళనాడులో స్థిరపడిన తెలుగు సినిమా ప్రొడ్యూసర్. అన్నీ మంచి సంప్రదాయమైన సినిమాలే తీసారు. నన్ను చూడగానే "రండి మీ కోసం ఎదురు చూస్తున్నాను. మొదటిరోజు ఎలాంటి కథ చెపుతారో అని" అన్నాడు.

నలభై సంవత్సరాల వయసులోనే నాలుగు మంచి సినిమాలు తీసారు. అలాంటాయన తన పిల్లలతో పాటూ నేను చెప్పబోయే కథ వినడం కోసం కాచుక్కూర్చున్నారు. నాకు కొంచెం టెన్షన్‌గా అనిపించింది. ఆయన పక్కనే కూర్చున్న ఇద్దరు పిల్లలు అబ్బాయికి పదేళ్ళు, అమ్మాయికి పన్నెండేళ్ళు వుంటాయేమో! పొడుగ్గా వున్న ఆ హాలులో ఒక బీరువా నిండా ఆయన సినిమాలకు వచ్చిన షీల్డులు ఒక బీరువా నిండా సాహిత్య పుస్తకాలు. నేను ఆలోచనలో పడ్డాను.

ఉదయం నించీ ఆకలి రాక్షసి భయపెట్టడంతో కథ గురించి ఆలోచించలేదు. పని అమ్మాయి ట్రేలో కాఫీ కప్పులతో వచ్చింది. కాఫీ కప్పు అందుకొని బాల్యంలోకి జారుకున్నాను. అమ్మ చెప్పిన కథ గుర్తుకొచ్చింది. ఒక్కసారిగా గొంతు సవరించుకుని చెప్పడం మొదలు పెట్టాను.

"అనగనగా ఒక రాజుగారు సైనికులకు యుద్ధతంత్రంలో శిక్షణ ఇవ్వటం కోసం శిబిరాలు ఏర్పాటు చేసారు. వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. తర్వాత గుడారాలను సైనికులు తరలించే దశలో రాజుగారు ఒక గుడారంపై పక్షులు గూళ్ళు పెట్టుకోవడం చూసారు. ఆ గుడారాన్ని అలాగే వుంచమని సైనికుల్ని ఆదేశించారు. వారం రోజుల తర్వాత సైనికులొచ్చి అడిగారు. 'ప్రభూ, గుడారం తీసెయ్యమంటారా?" అని రాజు గారొచ్చి ఆ గుడారం మీద గూళ్ళలో పక్షులు గుడ్లు పెట్టడం గమనించి, పాపం ఈ పక్షులు ఈ గుడ్లను ఎలా తీసుకు వెళతాయి. వీటిని మరికొంత కాలం వుంచండి" అన్నారు. మరికొన్ని రోజులకు సైనికులు మళ్ళీ వచ్చి "రాజా, ఆ గుడారం మీది గూళ్ళలోని పక్షుల గుడ్లన్నీ పొదిగి పిల్లయ్యాయి. ఇక గూడారం తీసెయ్యమంటారా?" అన్నారు.

వెంటనే ఆ రాజుగారు "ఈ పిల్లలు ఎదిగే వరకూ ఆగండి అన్నారు. మరికొన్ని రోజులకు రాజుగారి దగ్గరకు సైనికులు మళ్ళీ వచ్చి "ప్రభూ, పక్షుల పిల్లలన్నీ ఎదగడం నేర్చుకున్నాయి. ఇక గుడారాన్ని తీసెయ్యమంటారా? అన్నారు. వెంటనే ఆ రాజుగారు ఆ గుడారాన్ని స్వయంగా పరిశీలించారు. ఆ గుడారం మీద ఎన్నో పక్షుల గూళ్ళు. వాటిని చూసిన ఆ రాజుగారు నవ్వుతూ సైనికుల వంక చూసారు. ఆయన అంత రంగం అర్థం చేసుకున్న సైనికులు ఆ గుడారాన్ని తీసే ప్రయత్నానికి స్వస్తి చెప్పి అక్కడి నుంచి కదిలార. ఇంతకీ ఆ రాజుగారు ఎవరో మీకు తెలుసా?" అన్నాను. ఆ ఇద్దరు పిల్లల వైపు తిరిగి. వారిద్దరూ నా వంక ప్రశ్నార్థకంగా చూసారు.

ఆయన గురించి మరికొన్ని విశేషాలు చెవుతాను. ఆయన సింహాసనం ఎక్కి నేటికి ఐదొందల సంవత్సరాలయింది. ఆముక్తమాల్యద అనే కావ్యం రాసాడు. అష్ట దిగ్గజాలను పోషించిన ఆయన కవులకు అక్షర లక్షలిచ్చే వాడట! ఇక ఆయన గురించిన ఇంకో ముఖ్య విశేషం, వ్యవసాయం వృద్ధి చేయడానికి ఆయన ఎనిమిది వేల చెరువులు తవ్వించాడట! శిథిలమయి

పోయిన అలయాలను పునర్నిర్మించాడట. అయితే ఇంతకీ ఆయన రాజ్యమేలింది ఇరవయ్యేళ్ళే. 1509 నుంచి 1529 వరకూ, ఆయన పాలన సాగించి తన నలభయ్యవ ఏట కీర్తిశేషులయ్యారు.. అయినా ఐదు వందల సంవత్సరాలు గడిచినా నేటికీ ఆయన మన గుండెల్లో నిలిచి పోయారు. ఆయనే శ్రీకృష్ణదేవ రాయలు...'' అన్నాను. చెప్పడం ముగించి.

ఒక్కసారిగా ఆ ప్రొడస్యూరుగారితో పాటూ ఆ పిల్లలూ చప్పట్లు కొట్టారు. నేను సిగ్గుపడి మౌనంగా ఉండిపోయాను. ''బావుంది బాబూ, శ్రీకృష్ణదేవ రాయల గురించిన కొత్త సంగతి తెలిసింది. ఇలాంటి కరుణరస పూరితమైన కథలే చెప్పు...'' అన్నారు ప్రొడ్యూసర్.

నేను ఉత్సాహంగా లేచాను. అంతలోనే జేబులో పైసలు లేవనే విషయం గుర్తుకొచ్చింది. ఆయనను కొంత డబ్బు అడుగుదామనుకున్నాను. అయినా మొహమాటంతో సంశయిస్తూ నిలబడ్డాను. నా మనసులోని మాటను గ్రహించారు. కాబోలు. జేబులోంచి కొన్ని నోట్లు తీసి నాకందించారు.

''థేంక్యూ సార్!'' అంటూ ఆనందంగా ఆ ఇంట్లోంచి బైట పడ్డాను. గేటు దాటుతుంటే ప్రొడ్యూసర్ గారి పిల్లలు కనిపించారు. అప్పుడే కళ్ళు తెరిచిన పిల్లి కూనలకు పాలు పడుతున్నారు. ఆ దృశ్యం చూసి నాకు ప్రపంచాన్ని జయించినంత ఉత్సాహం కలిగింది. నేను చెప్పిన కథకో, ప్రయోజనం చేకూరిందన్న మాట. అనుకుంటూ ఆనందంగా కదిలాను. తారా స్థాయిలో వర్షం ఆటో రిక్షా ఎక్కి రూముకు చేరుకున్నాను.

*　　*　　*

మూడు రోజుల పాటు భారీ వర్షాలు, తుఫాను. చెన్నై నగరం పూర్తిగా నీటిలో మునిగింది. ఈ మూడు రోజులూ రూములోంచి బైటకు కదల లేదు. ప్రొడ్యూసర్ గారి పిల్లలకు చెప్పాల్సిన కథల గురించి ఆలోచిస్తూ తెలిసిన కథల్ని రాసుకుంటూ రూములోనే ఉండిపోయాను.

రైలెక్కుతూ ఒక చెప్పు పడిపోతే, అది దొరికిన వారి కోసం రెండో చెప్పు విసిరేసిన గాంధీగారి ఔదార్యం గురించి, విజయం కోసం కాకుండా విలువలే లక్ష్యంగా బతకమన్న ఆల్‌బర్ట్ ఐన్‌స్టీన్ గురించి, మూడుసార్లు అబద్ధం చెప్పిన, నాన్నా పులి కథలోని గొర్రెల కాపరి కుర్రాడి గురించి, తన జీవితానికి సంబంధించిన విలువలను తిరిగి మరోసారి నిర్వచించుకుని ఆ లక్ష్యం దిశగా పనిచేసిన ఆల్‌ఫ్రెడ్ నోబెల్ గురించి ఒక పావురం జీవితాన్ని కాపాడటం కోసం తన సర్వస్వాన్నీ అర్పించడానికి సిద్ధపడిన శిబి చక్రవర్తి గురించి, వజ్రాయుధం తయారుచేయడానికి తన వెన్నెముకను ధార పోసిన దధీచి గురించీ - ఇలా ఎన్నెన్నో కథలు జీవిత వికాసాన్ని, ప్రేమను కరుణను విప్పి చెప్పేవి వీటన్నిటి గురించి రాసుకున్నాను ఆ మూడు రోజులూ.

నాలుగో రోజు తుఫాన్ వెలిసింది. బద్ధకం వదిలించుని రూము లోంచి బైటపడ్డాను.

నడుస్తున్నాను. నిర్మలంగా ఉన్న ఆకాశంలోకి అప్పుడే సూర్యుడు తొంగి చూస్తున్నాడు. మబ్బులు పూర్తిగా పలబడ్డాయి. పార్కుకి వేగంగా చేరుకున్నాను. నేనెప్పుడూ కూర్చునే బెంచీ మీద నడుం వాల్చాను.

''ఆ ముసలి యాచకుడు కనిపిస్తే బాగుండును. అతడు నా కోసం ఖర్చు చేసిన ఆ డబ్బులు తిరిగి ఇచ్చెయ్యాలి...'' అనుకున్నాను.

ఇంతలో టీ కుర్రాడు ''సార్, టీ కావాలా'' అంటూ వచ్చాడు.

''వద్దు గానీ, మొన్న నాకు టిఫిన్ తెచ్చిన ఆ ముసలాయన ఎక్కడుంటాడు?'' అన్నాను.

''ఆ కొండ దిగువున లేబర్ కాలనీ సార్!'' అన్నాడు.

''సరే చూపించు'' అంటూ కదిలాను.

ఆ కుర్రాడు ముందుకు నడిచాడు. పార్కు దాటి ఆ రోడ్డు దాటి బీచ్

ఎదురుగా ఉన్న లేబర్‌కాలనీలోని తీసుకెళ్ళాడు. ముక్కు మూసుకున్నాను. చిన్న గుడిసె ల్లాంటివి వరసగా ఉన్నాయి. మనుషులు, జంతువులు కలిసి సహజీవనం చేస్తున్నట్టున్న వాతావరణం. గుడిసెల చుట్టూ తిరుగుతూ అరుస్తున్న కుక్కలు, ఆ టీ కుర్రాడు నన్ను ఒక గుడిసె ముందు నించోబెట్టి అక్కడ నించి పరిగెత్తాడు. ఆ ఇంటి చుట్టూ చాలా మంది యాచకులు. కొంతమంది అంగవికలురు. మరి కొంతమంది సాధువులు వారంతా నా వంక ప్రశార్థకంగా చూసేసరికి "ఆ ముసలాయన కోసం" అన్నాను.

"ఇంకెక్కడి ముసలాడు? చచ్చిపోయాడండీ! మూడు రోజుల్నించీ తిండి లేదు! దిక్కుమాలిన తుఫాను! అడుక్కుందామన్నా ఇచ్చే దాత లేడు... ఆకలికి చచ్చిపోయి వుంటాడు బాబూ" అన్నాడొక సాధువు.

ఆ మాటలతో నా కడుపులో పేగు కదిలింది. దుఃఖం ముంచు కొచ్చింది. పాపం తను మిగుల్చుకున్న డబ్బులు నాకోసం ఖర్చు పెట్టేసి ఉంటాడు. నా ఆకలి తీర్చిన ఒక యాచకుడిని ఆకలి చావు వరించింది.

నా మనసులో బాధ, నన్ను ఋణగ్రస్తుడిని చేసి వెళ్ళిపోయిన ఆ ముసలాయన జ్ఞాపకం నన్ను తీవ్ర కల్లోలానికి గురిచేసింది.

"బాబూ ఈ ముసలాయన దహన సంస్కారాలు ఎలా?" అన్నాను ఆ సాధువుతో.

"మేం ఏం చెయ్యగలం బాబూ? తమలాంటి దాతలు కరుణిస్తే అంతిమ సంస్కారం జరపగలం. లేకపోతే శవాన్ని ఏ కార్పొరేషను వాళ్ళో ఈడ్చుకుపోతారు." అన్నాడు.

నాకు మళ్ళీ దుఃఖం. నా ఆత్మ బంధువు కోసం నేనేం చెయ్యాలి? ఆ క్షణంలో ఒక నిర్ణయానికొచ్చాను. ఆ ప్రొడ్యూసర్ గారిచ్చిన డబ్బు తీసి ఆ సాధువు చేతిలో ఉంచాను.

“దహన సంస్కారానికి ఏర్పాట్లు చెయ్యండి. అంతవరకూ నేనిక్కడే వుంటాను” అన్నాను.

రెండు గంటల్లో అన్ని ఏర్పాట్లూ జరిగాయి. పాడె మీద నిర్జీవంగా ఆ ముసలి శరీరం. నా ఆకలి తీర్చిన అన్నదాతకు నమస్కరించాను. పాడె కదిలింది. కొంత దూరం వారిననుసరించి నా రూము వైపు నడిచాను.

ఇంతలో చిన్న అంగవస్త్రం కట్టుకుని అడుక్కుంటున్న ఒక నిండు చూలాలు ఎదురయ్యింది. “బాబూ ఆకలి...!” అంటూ కడుపు చూపించింది. జేబులో కొంత చిల్లర వుంది. ఇద్దామా వద్దా అనే సందిగ్ధంలో ఆమెను దాటి ముందుకు నడిచాను. జేబులో మిగిలినవి ఇవే! ఈ రోజు రాత్రికి రొట్టె, టీ దొరుకుతుంది. నడుస్తూ వెనక్కి తిరిగాను. ఇంకా ఆశగా చూస్తున్న ఆ గర్భిణీ స్త్రీ.

హఠాత్తుగా ప్రొడ్యూసర్ గారి పిల్లలకు నీతి కథలు చెపుతున్న నాలోని ఉపాధ్యాయుడు మేల్కొన్నాడు. గబగబా ఆమె వైపు నడిచాను. జేబులో మిగిలిన చిల్లర అంతా ఆమె దోసిట్లో పోశాను. ‘ఇద్దరు ప్రాణుల ఆకలి తీరుతుంది’ అలా అనుకుంటూ వేగంగా రూము వైపు కదిలాను. నడుస్తూ ఆకాశం వంక చూసాను. అది ఇంతకు ముందు కంటె విశాలంగా కనిపించింది.

(నవ్య వీక్లీ, అక్టోబర్ 26-2011)